ప్రజాశక్తి

శుక్రవారం 16 జూన్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

# పర్చూరులో వసూళ్లు అవాస్తవం

- కావాలనే తనపై దురుద్దేశంతో ప్రచారం
- వైసిపి పర్చూరు ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పర్చూరు నియోజకవర్గంలో గ్రానైట్, ఇతర రంగాల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు సాగుతున్న ప్రచారం అంతా అవాస్తవమని వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ కొట్టిపారేశారు. 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'పర్చూరులో ఇన్‌ఛార్జి వసూళ్లపైనే దృష్టి' అనే కథనంపై ఆయన మాట్లాడుతూ ఇదంతా తనకు గిట్టనివాళ్లు చేసే ప్రచారమేనన్నారు. నియోజకవర్గంలో తన మనుషులు గానీ, పార్టీ కార్యకర్తలు గానీ ఎటువంటి వసూళ్లకు పాల్పడటం లేదన్నారు. వసూళ్లు చేస్తున్నట్లు నిరూపిస్తే ఎంతటికైనా సిద్ధమేనని సవాలు విసిరారు. వసూళ్లు చేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. తనకు వ్యతిరేకంగా ఉన్న నేతలు ఇదంతా చేస్తున్నారన్నారు. ప్రజల్లోకి తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. దీని వల్ల పార్టీకి నష్టమన్నారు. ఈ వ్యవహారాలను పార్టీ పెద్దల దృష్టికీ తీసుకు పోతామన్నారు. నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టాక గడపగడపకూ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని రకాల సమస్యలపై దృష్టి సారించామన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కృష్ణమోహన్ అన్నారు. తాము ఎంతో హుందాగా రాజకీయాలు చేస్తున్నామని, దీన్ని సహించలేని కొందరు తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. ఇలాంటి వాటికి ఏనాడూ భయపడలేదన్నారు. తన పనితీరు వల్లే చీరాల్లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచామన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పర్చూరులో ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు ఇక్కడే పోటీ చేస్తామన్నారు. ఇప్పటికైనా తనపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# రూ.4 కోట్లు వృథా.!

- నాడు కట్టింది మూలన.. నేడు మళ్లీ స్థల సేకరణ
- మళ్లీ అభివృద్ధికి స్థలం కోసమని అధికారుల పరిశీలన
- ఇదీ టూరిజం శాఖ పనితీరు

టీడీపీ ప్రభుత్వ హయాంలో కట్టి వదిలివేసిన టూరిజం రెస్టారెంట్

ప్రజాశక్తి-శింగరాయకొండ

టూరిజం శాఖ పరిస్థితి దారుణంగా ఉంది. గతంలో సగం ఆగిన పనులను వదిలేసి.. మరోసారి తాము అభివద్ధి చేస్తామని.. తమకు స్థలాలు చూపించాలని రెవెన్యూ శాఖను వేడుకుంటున్నరు. పాకల సముద్ర తీరంలో అభివద్ధి చేయాలన్న ఉద్దేశంతో టూరిజం శాఖ ఐదు ఎకరాల స్థలం కావాలని కోరటంతో వారం క్రితం జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు పాకల పల్లెపాలెం వద్ద సర్వే నెంబర్ .804, 832లో స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. పాకల సముద్రతీరానికి వచ్చిన అధికారులు గతంలో ఉన్న భవనాన్ని చూసి.. ఇప్పుడు స్థలాన్ని చూసి.. వెళ్లిపోయారు తప్ప. గతంలో కట్టింది ఎందుకు వదిలేశారు ఇప్పుడు ఏం కట్టబోతున్నారనే విషయాన్ని కూడా గమనించకపోవడం విశేషం. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో 2018 సంవత్సరంలో ఏపీ ప్రభుత్వం పర్యాటక శాఖ భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో పాకల సముద్ర తీరంలో రెస్టారెంట్‌ను మొదలుపెట్టారు. దాదాపు మొత్తం పూర్తయింది. చివరి క్షణంలో అంతా పూర్తయిన ▶ 2లో

ప్రస్తుతం టూరిజం అభివృద్ధికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

# జూన్‌లోనూ మండుతున్న ఎండలు..

- 42 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు
- వర్షాభావంతో ఖరీఫ్ సాగుకూ ఆటంకం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జూన్ రాగానే ఎండలు తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. ఇప్పుడు జూన్ సగం దాటినా ఎండలు మండుతున్నాయి. జనం అల్లాడిపోతున్నారు. బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఎండల తీవ్రత బాగా ఉంది. వేసవి పోయినా ఇంకా దాని ప్రభావం తగ్గలేదు. మే నెల నుంచీ ఇదే పరిస్థితి. గురువారం నాడు కూడా జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం నుంచే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. 10 గంటల తర్వాత తిరగాలన్నా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చింది. ఎండలకు తోడు వడగాల్పులు తీవ్రంగానే ఉన్నాయి. వాతావరణం బాగా వేడెక్కింది. సాయంత్రం 7 గంటల వరకూ చల్లబడటం లేదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. జూన్‌లో 58.0 మి.మీ.లు వర్షం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటివరకూ వర్షమే కురవలేదు. దీంతో ఖరీఫ్ సాగుకూ ఆటంకంగా మారింది. భూములు దున్నారు. విత్తనాలు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల స్వల్పంగా వర్షాలు పడినా విత్తనాలు వేయలేదు. వేసిన కొద్ది చోట్ల కూడా ఎండుముఖం పట్టాయి. వడగాలులకు మొలకెత్తినవి ▶ 2లో

మండే ఎండలో బైక్‌పై వెళుతున్న దృశ్యం (ఫైల్)

# కార్మికులకు ఇఎస్ఐ వైద్యసేవలేవీ?

- ఆసుపత్రి లేక వైద్యం కోసం ఇబ్బందులు
- గతంలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలుకు నోచని వైనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో వేలాది కార్మికులు, ఉద్యోగులు ఉన్నారు. వీరి జీతాల నుంచి ప్రతి నెలా కొంత ఈఎస్ఐకి వైద్యసేవల నిమిత్తం చెల్లిస్తున్నారు. రెండు జిల్లాల్లో కార్మికులు ఈఎస్ఐ ఆసుపత్రి అందుబాటులో లేక.. వైద్య సేవల కోసం కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈఎస్ఐ ఆసుపత్రి కోసం కార్మికులు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. జిల్లాల్లో గ్రానైట్, ఆక్వా, పొగాకు పరిశ్రమలతో పాటు వాళ్ల చిన్న, పెద్ద పరిశ్రమలు, కార్యాలయాల్లో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులకు ఏదైనా వైద్యసేవలు అవసరమైతే వారు గుంటూరు, విజయవాడ లాంటి నగరాలకు వెళ్లాల్సి వస్తుంది. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా జిల్లాకు ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని గతంలో కేంద్రప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఈ హామీ అమలుకు నోచుకోలేదు. చీరాల, మార్టూరు, మార్కాపురంలలో ఈఎస్ఐ డిస్పెన్సరీలు మాత్రమే ఉన్నాయి. ఒంగోలులో ప్యానల్ క్లినిక్ ఉంది. వీటిలో ప్రాథమిక వైద్యసేవలు, కొద్దిపాటి మందులు మాత్రమే దొరుకుతాయి. కార్మికులు, ఉద్యోగులకు ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర వైద్యసేవలు గానీ, శస్త్రచికిత్సలకు గానీ అవకాశం లేదు. చికిత్సల కోసం అధిక వ్యయ ప్రయాసలతో దూరప్రాంతాల్లో ఉన్న వైద్యశాలలకు కార్మికులు వెళ్ళాల్సి వస్తోంది. ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా కార్మికులు, ఉద్యోగులకు రూ.5 లక్షల వరకు వైద్య సేవలు అందుతాయి. చికిత్స కోసం సెలవులో ఉన్నప్పుడు 75 శాతం వేతనం లభిస్తుంది. బీమా సౌకర్యం ఉంటుంది. అవసరమైతే మెరుగైన వైద్య సేవల కోసం కార్పొరేట్ ఆసుపత్రికి సిఫార్సు చేస్తారు. కార్మికులకు మెరుగైన వైద్యసేవల కోసం బాపట్ల, ఒంగోలు జిల్లా కేంద్రాల్లో అయినా ఈఎస్ఐ ఆసుపత్రులు మంజూరు చేయాలని కార్మికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

ఘటనాస్థలంలో పడి ఉన్న యువకుల మృతదేహాలు

# స్నేహితుడి జన్మదిన వేడుకలకు వచ్చి..

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-మద్దిపాడు

వేగంగా వస్తున్న బైకు అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని గుండ్లాపల్లి వద్ద గురువారం చోటు చేసుకుంది. మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కష్ణా జిల్లాకు చెందిన రవితేజ (22), శివతేజ (21) ఒంగోలులోని తన మిత్రుడు పుట్టినరోజు వేడుకలకు బుధవారం రాత్రి హాజరయ్యారు. వేకువజామున తిరుగు ప్రయాణంలో బైక్‌పై వేగంగా విజయవాడ వెళుతున్నారు. గుండ్లాపల్లి ఫ్లైఓవర్ దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు, జిజిహెచ్‌కు తరలించారు. వీరిద్దరూ విజయవాడ సిద్ధార్థ లా కాలేజీలో ఫైనలియర్ చదువుతున్నారు.

# నత్తనడకన 'నాడు-నేడు'

- పూర్తికాని అదనపు గదుల నిర్మాణం
- విద్యార్థులకు తప్పని అవస్థలు

శ్లాబుతోనే ఆగిన అదనపు గదులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం రెండో దశ నాడు-నేడు పథకం కింద చేపట్టిన పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఆరంభంలో ఆర్భాటం చేసిన ప్రభుత్వం అనంతరం పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన పనులకు నిధులు విడుదలలో జాప్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. మంజూరైన పనులకు ఇప్పటి వరకు కేవలం 4వ వంతు నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యానికి సంబంధించిన పనులను పాఠశాలలు పున్ణప్రారంభానికి ముందే (ఈనెల 12లోపు) పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. అయినప్పటికీ పురోగతి కరువైంది. నిధులు విడుదల చేయకుండా పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తుండటంతో ప్రధానోపా ధ్యాయులు, పాఠశాలల తల్లిదండ్రుల కమిటీల ప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. నిధుల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం నాడు-నేడు పనులకు శాపంగా మారిందని వాపోతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు-నేడు పథకంలో భాగంగా రూ.2.4 కోట్లు నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. 12 పాఠశాలల్లో ఒక్కచోట కూడా పనులు పూర్తి కాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థుల సంఖ్య పెరిగి తరగతి గదుల కొరత ఉండడంతో విద్యార్థుల సౌకర్యం కోసం అదనపు గదులకు రాష్ట్రప్రభుత్వ గతేడాది రూ. 2.4 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఏడు నెలల క్రితం పనులు ప్రారంభించిన ఒక్కచోట కూడా పూర్తి కాలేదు. యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిది గదులు మంజూరు కాగా స్లాబ్ పూర్తి అయ్యింది. వీరభద్రాపురం పాఠశాలలో ఆరు గదులకు స్లాబ్ వేశారు. మిగతా చోట్ల పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, నిధులు మంజూరులో జాప్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. విద్యార్థులు ఆయా పాఠశాలల్లో గదులు సరిపోక, సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. యుద్ధప్రాతిపదికన నాడు-నేడు పనులను పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## రూ.4 కోట్లు వృథా.!

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఎన్నికలు రావడంతో వైసిపి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన కాడ నుంచి ఇప్పటివరకు ఆ టూరిజం రెస్టారెంట్ వైపు వైసిపి నాయకులు గానీ , అధికారులు గానీ కన్నెత్తి కూడా చూడని పరిస్థితి ఉంది. రూ.నాలుగు కోట్లను వృథాగా వదిలేశారు. అక్కడ ఇనుముతో కట్టిన మొత్తం నిర్మాణం తుప్పుబట్టి పోయింది. టూరిజం శాఖ సామాగ్రి కూడా పోయాయి. రూ.నాలుగు కోట్లు వథా అయిపోయినా టూరిజం శాఖ అధికారులు మాత్రం ఆ వథా అయిన నిధుల గురించి పట్టించుకోకుండా మరోసారి అభివద్ధి చేస్తామని ప్రభుత్వానికి సిఫార్సు చేసి పాకల సముద్ర తీరంలో స్థలాలు అడగటం ఈ ప్రాంతంలో వివాదాస్పదంగా మారింది. ఉన్న భవనాన్ని వదిలేసి.. కొత్తగా అభివద్ధి చేస్తామని చెప్తున్న అధికారులు ఉన్నదాన్ని ఏం చేస్తారని ప్రశ్నిస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఉన్న భవనాన్ని గాలికి వదిలేశారని, ఇప్పుడు స్థలం తీసుకొని ఆ స్థలాన్ని ఏం చేస్తారని మత్స్యకారులు అడుగుతున్నారు.

## జూన్‌లోనూ మండుతున్న ఎండలు..

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఎండిపోయాయి. రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. చినుకు జాడ లేదని ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి ఎంత కాలం కొనసాగుతుందోనన్న ఆందోళన కూడా పెరుగుతోంది. తాగునీటి సమస్య కూడా వీడలేదు. పశ్చిమాన పలుచోట్ల తాగునీటి కష్టాలు కొనసాగుతున్నాయి. చెరువులు, స్టోరేజీ ట్యాంకులు ఎండిపోతున్నాయి. నీటి విడుదల సమయం కూడా తగ్గించారు. నీరు సరిపడా ఇవ్వలేకపోతున్నారు. ఒంగోలు పట్టణంలోనే నీరు సక్రమంగా రావడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. పావు గంట ఇచ్చి ఆపేస్తున్నారు. కారణం నీరు అందుబాటులో లేకపోవడమే. మరో వైపు కరెంటు కోతలు తీవ్రంగా ఉన్నాయి. ఎండలకు ఏసీల వినియోగం పెరిగింది. ఓవర్‌లోడ్‌కు ట్రాన్స్‌ఫారాల్లో ఫీజులు పోతున్నాయి. ఆసుపత్రుల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక చిరువ్యాపారులు కూడా ఎండల్లోనే కాయలు అమ్ముకుంటున్నారు. జీవనోపాధి పథకం కూలీలు ఎండల్లోనే గడుపుతున్నారు. ఉపాధి హామీ పథకం కూలీలు కూడా ఎండలకు పనులు చేయలేకపోతున్నారు. ఎండలకు అన్ని రకాలుగా జనం ఇక్కట్లు పడుతున్నారు.

మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుశీల

## మంత్రి సురేష్‌ను కలిసిన రవాణాశాఖ కమిషనర్ సుశీల

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను ఒంగోలు రవాణాశాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సుశీల గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో రవాణ శాఖ పని తీరుపై వారు కొద్దిసేపు చర్చించుకున్నారు. పాఠశాలలు ప్రారంభమైనందున స్కూల్ బస్సుల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సురేష్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని బస్సులను నడిపినట్లయితే చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని అన్ని సౌకర్యాలు ఉన్న బస్సులకే అనుమతులు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఎంవిఐ మాధవరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డికి సన్మానం

సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న మధుసూదనరెడ్డి

ప్రజాశక్తి-దర్శి

తాళ్ళూరు మండలంలోని పలు గ్రామాల్లోన్నున్న దేవాలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తాళ్ళూరు మాజీ ఎంపిపి పోశం మధుసూధనరెడ్డి తెలిపారు. తాళ్ళూరు మండలం బెల్లంకొండవారి పాలెంలో అంకమ్మ తల్లి గుడికి రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డిని సోమవారం మర్యాద పూర్వకం కలిసి అభినందించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా రజానగరం ఎస్‌సీ కాలనీలోని రామాలయం , తాళ్ళూరులో బ్రహ్మం గారి గుడికి, తూర్పుగంగవరంలోని హరిదాసు నగర్‌లోని రామాలయం గుడికి నిధులు మంజూరు చేయాలని కోరగా అందుకు వైవి. సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు మధుసూదనరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోటా రామిరెడ్డి, ఐవిరెడ్డి, జక్కుల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## మలినేని వెంకటేశ్వర్లుకు పరామర్శ

వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న అశోక్‌బాబు

ప్రజాశక్తి-సింగరాయకొండ

కనుమళ్ల సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడ్డాడు. చికిత్స అనంతరం ప్రస్తుతం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న ఎపిఎస్ ఆర్‌టిసి జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి గురువారం వెంకటేశ్వర్లును పరామర్శిం చారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వైసిపి కొండపి నియోజక ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు కూడా కనుమళ్ల వచ్చి మలినేని వెంకటేశ్వర్లును పరామర్శించారు. వెంక టేశ్వర్లును పరామర్శించిన వారిలో సర్పంచి మలినేని ఇందిర తదితరులు ఉన్నారు.

## బాధితులకు దుస్తులు అందజేత

బాధితులకు సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే రాంబాబు

ప్రజాశక్తి -అర్ధవీడు

మండల పరిధిలోని గురుకుల పాఠశాల సమీపంలోనున్న చెంచు కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 12 మందికి సంబంధించిన పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధితులను ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు గురువారం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణ సాయంగా బాధితులకు వస్త్ర సామాగ్రి, దుస్తులు, పట్టాలు, ఇతర సామగ్రి అందజేశారు. బాధితులకు ప్రభుత్వ నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బాధితులతో మాట్లాడారు. జగనన్న కాలనీ లేఅవుట్‌లో గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. గృహాలు నిర్మించుకొనే ఆర్థిక స్థోమత తమకు లేదని బాధితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**వంటసామగ్రి, దుప్పట్లు పంపిణీ**

అగ్నిప్రమాద బాధితులకు సాయిరాం పెయింట్స్ ప్రొప్రైటర్ పల్లాటిశేఖర్ రెడ్డి, కెఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కర్నాటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వంట సామగ్రి, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, తిరుపతి, వినోద్, గుండా అంజి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## కామయ్యకు ఎమ్మెల్యే స్వామి నివాళి

ప్రజాశక్తి-కొండపి

కొండపి పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెంలో టిడిపి నాయకుడు నెప్పల కామయ్య దశ దిన కర్మ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొని కామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రావెళ్ల రాఘునాథబాబు, అనుమాల ప్రసాదు పాల్గొన్నారు.

## విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-కొండపి

ఇంటర్ సప్లమెంటరీ ఫలితాలలో కొండపి జూనియర్ కళాశాలకు చెందిన టి.దివ్య అనే విద్యార్థిని జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. దివ్య జూనియర్ ఇంటర్ బైపిసిలో .431/440 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన టి.దివ్యను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

# క్రీడలతో యువతలో పోరాట స్ఫూర్తి

ప్రజాశక్తి-కర్లపాలెం

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ఎక్కువగా ఆడటం వలన యువతలో పోరాట స్ఫూర్తి పెరుగుతుందని వైసిపి నాయకులు మార్పు బెనర్జీ అన్నారు. కర్లపాలెం మండలం నర్రావారి పాలెం గ్రామంలో నిర్వహించిన కోన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ముగిసింది. మొత్తం 30 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంటులో ఫైనల్‌లో మార్పు చెన్నయ్య గారి పాలెం - నర్రవారిపాలెం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన నర్రవారిపాలెం జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 84 పరుగులు సాధించింది. 85 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన మార్పు చెన్నయ్య గారి పాలెం జట్టు 10 ఓవర్లకు 85 పరుగులను ఛేదించింది. ఈ టోర్నమెంట్లో మూడో బహుమతిని దాస్ నగర్ టీం కైవసం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌కు మొదటి బహుమతిగా రూ.15,000 ప్రముఖ వ్యాపారవేత్త గుండ్రెడ్డి శివ అందజేశారు. రెండో బహుమతిని వైసిపి నాయకులు మార్పు బెనర్జీ, మూడో బహుమతిని మండల యూత్ కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు అందజేశారు. అలాగే నర్రా వెంకట సుబ్బారావు, నర్రా గోపి, మరక రాజు, మల్లారపు గోపి, నర్రా నాగరాజు, అక్కల దుర్గా రెడ్డి, నంగు మణికంఠ రెడ్డి, నంగు రాజేష్ రెడ్డి వ్యక్తిగత బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విజేతలకు యల్లావుల ఏడుకొండలు, మార్పు బెనర్జీ, మార్పు రత్నం బహుమతులు అందజేశారు.

బాపట్లలో జరిగిన క్రికెట్‌లో విజయం సాధించిన జట్టు

## 19న చేనేతల ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 19 జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయ ప్రదం చేయాలని చేనేత రాష్ట్ర నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేపట్టిన ప్రచార జాతా గురువారం భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సొసైటీలలో నిల్వ ఉన్న వస్త్రాలను తక్షణం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు జరపాలి, జిఎస్‌టిని తక్షణమే రద్దు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని షెడ్డు కార్మికులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు దీపాల సత్యనారాయణ, బాలాజీ, మురుగుడు సత్యనారాయణ, దొంతు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సరుకులు అందజేస్తున్న వాకర్స్

## పిల్లల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలి

ప్రజాశక్తి-సంతమాగులూరు

స్థానికంగా దొరికే మెటీరియల్‌తో, వివిధ రకాల బోధన, అభ్యసన, సామగ్రిని తయారుచేసి పిల్లల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలని సిడిపిఒ డి సుధ తెలిపారు. గురువారం మండలంలోని సంతమాగులూరు ఐసిడిఎస్ పరిధిలోని పాతమాగులూరు ఎస్సీ-2 అంగన్‌వాడీ సెంటర్‌లో జనభాగిదారి ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని కమ్యూనిటీ భాగస్వామ్యంతో, ప్రీ స్కూల్ విద్య ఆవశ్యకతను తెలియజేశారు. ప్రీ స్కూల్ కిట్ మెటీరియల్ పిల్లల సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. పిపి వన్, పిపి టు పుస్తకాలు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాల ద్వారా పిల్లలకు ఆటపాటలతో విద్యను సులభరీతిలో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమూహాలు ఏర్పాటు చేసి, రంగులతో రంగవల్లికలతో పిల్లలచే తల్లిదండ్రుల ద్వారా నేర్పించనున్నట్లు తెలిపారు. పిల్లల పురోభివృద్ధికి మూడు నెలలకు ఒకసారి చైల్డ్ అసైన్మెంట్ కార్డు ద్వారా అంచనా వేయడం జరుగుతుందన్నారు.

ఆరు సంవత్సరాల లోపు పిల్లల భవిష్యత్తుకు గట్టి పునాది వేయడానికి నేర్పించవలసిన విషయాలకు సంబంధించి, స్థానికంగా దొరికే మెటీరియల్‌తో వివిధ రకాల బోధన అభ్యసన సామగ్రి ద్వారా పిల్లలకు బోధించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ విద్య ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, అధికారులు, గ్రామ పెద్దలు, సూపర్ వైజర్లు నాగరాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి-వేటపాలెం

ఎన్ఆర్అండ్‌పిఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా గురువారం మండల పరిధిలోని దేశాయిపేట, నీల కంఠపురంలోని అనాథ వృద్ధాశ్రమంలో వాకింగ్ సభ్యుడు టి బాలగంగాధరరావు పుట్టినరోజును పురస్కరించుకొని రూ.3,500 విలువగల నిత్యావసర సరుకులను వృద్ధాశ్రమానికి అందజేశారు. కార్యక్రమంలో అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకష్ణ, దరియా సాహెబ్, బాలగంగాధరరావు, చింతా రమేష్, వంగర పూర్ణచంద్రరావు, ఎం భాస్కర రావు, చెంగలరాయుడు, శ్రీనివాసరావు, ఆశ్రమ ప్రెసిడెంట్, వాకర్స్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: ఐసిడిఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు పరిధిలోని ఇంకొల్లు సెక్టారులోని ఇంకొల్లు-6 అంగన్‌వాడీ కేంద్రంలో జనభాగిదారీ కార్యక్రమం జరిగింది. తల్లులు మరియు పిల్లలతో రంగోళి కార్యక్రమం నిర్వహించారు. ముగ్గులతో అక్షరాలను, అంకెలను దిద్దించారు. బొమ్మలను వేయించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ పివి వదనకుమారి మాట్లాడుతూ 3 సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హైస్కూల్లో కార్పొరేట్ విద్య: ఎమ్మెల్యే

### పదిలో, ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల అవార్డులు

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం అనుభవం కలిగిన అధ్యాపకులచే నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడంతో పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. గురువారం మునిసిపాలిటీ పరిధిలో కస్తూరిబా గర్ల్స్ హైస్కూల్లో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చీరాల నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులలో పందిళ్లపల్లి హైస్కూల్ విద్యార్థి డి విష్ణు ప్రియ 591 మార్కులతో ప్రథమ స్థానంలో, చీరాల కస్తూరిబా గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని బి భావన 584 మార్కులతో ద్వితీయ స్థానంలోనూ, ఈపురుపాలెం గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు పి గాయత్రి ఎం జాహ్నవి లు 583 తృతీయ స్థానం సంపాదించారని అన్నారు. అదేవిధంగా చీరాలలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నలుగురు విద్యార్థులు ఎస్‌కే రిజ్వానా, టి శ్రీ నాగవర్ష కే అవంతి దేవి, ఎం ఇందు రూ.15 వేల నగదును బహుమతులుగా పొందారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రదానంతో పాటు అధ్యాపకులను విద్యార్థుల తల్లిదండ్రులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు హైస్కూళ్ళపై మక్కువతో తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన నగదును వేలకు వేలు ఫీజులు చెల్లిస్తూ ప్రైవేట్ విద్యా విధానాన్ని పోషిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ హైస్కూళ్లను మించిన సదుపాయాలతో వైసిపి ప్రభుత్వం అన్ని వస్తువులతో ఇంగ్లీషు తెలుగు మీడియం విద్యారంగాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా విద్యా సామగ్రి, భోజన వసతులను కల్పిస్తున్నారని అన్నారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. అనంతరం ఆయన విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్ బాబు, మామిడాల రాములు, బత్తుల అనిల్, కంపా అరుణ్, మల్లెల లలిత, రాజశేఖర్, షేక్ కబీర్, మునిసిపల్ డిఇ ఐశయ్య, కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, పందిళ్లపల్లి ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, చీరాల కేజీఎం గర్ల్ హైస్కూల్ ప్రిన్సిపల్ కృష్ణ మోహన్, ఈపురుపాలెం గర్ల్స్ హైస్కూల్ ప్రిన్సిపల్ హనూరా, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి నుంచి కందుకూరుకు వెళ్లే రోడ్డులో ఎఫ్‌సిఐ గోడౌన్ వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. ఘటనా స్థలంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలి బూడిదయిన వరిగడ్డి వాము

## యాజలిలో వరిగడ్డి వాము దగ్ధం

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో ఇక్కుర్తి రవీంద్రకు చెందిన సుమారు 10 ఎకరాలలోని వరిగడ్డి వామి అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

దిశ యాప్ గురించి మాట్లాడుతున్న డిఎస్‌పి

## మహిళలకు రక్షణ కవచం 'దిశ' యాప్

ప్రజాశక్తి-కొల్లూరు

దిశ యాప్ ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ కవచం లాంటిదని రేపల్లె డిఎస్పి టి మురళీకృష్ణ అన్నారు. కొల్లూరు పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం జగన్మోహన్ రెడ్డి ఈ యాప్‌ని తీసుకొచ్చారని ఆయన అన్నారు. ప్రతి మహిళలు ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వేమూరు, చుండూరు సిఐలు కే వెంకటేశ్వరరావు, ఏ రాజమోహన్ పాల్గొన్నారు.

వృద్ధుల భద్రతపై గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న బాపట్ల ఎస్‌పి వకుల్ జిందాల్

## వృద్ధుల భద్రతకు భరోసా..

ప్రజాశక్తి-బాపట్ల

వేధింపుల నుంచి రక్షణ కల్పించి వృద్ధులు గౌరవప్రదంగా బ్రతికేలా భద్రత కల్పిస్తామని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం ప్రపంచ వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా గోడ ప్రతులను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వృద్ధుల పోషణకు, ఆస్తిపాస్తుల రక్షణకు భరోసా కల్పిస్తామని అన్నారు. సమాజంలో పెద్దలను గౌరవించే సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు జీవీ బ్రహ్మం, కార్యదర్శి కె శ్రీహరిరావు, కోశాధికారి సిహెచ్ శ్రీరామశర్మ ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు, అసోసియేషన్ సభ్యులు బి వెంకటేశ్వర్లు, పి వెంకటేశ్వర్లు ఎం తాతయ్య, ఎం మాల్యాద్రి రావు, పి విజయసారథి పాల్గొన్నారు.

లక్ష్మీ సుజితను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

## అందరికీ ఆదర్శం లక్ష్మీ సుజిత: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

సివిల్స్ ఫలితాల్లో 311 ర్యాంకు సాధించిన వీరగంధం లక్ష్మీ సుజిత కృషి ప్రశంసనీయమని, స్వయం శక్తితో ఎదిగే యువత లక్ష్మి సుజితను ఆదర్శంగా తీసుకోవాలని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గ్రామీణ ప్రాంతంలో విద్యనభ్యసించి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని వదులుకొని సివిల్స్‌లో ర్యాంక్ సాధించాలనే పట్టుదలతో ఎటువంటి కోచింగ్ లేకుండా విజయం సాధించడం విశేషమని అన్నారు. గురువారం వీరగంధం విద్యాసంస్థల అధినేత వీరగంధం శ్రీనివాస్, భవాని దంపతుల కుమార్తె అయిన లక్ష్మి సుజిత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 311 ర్యాంక్ సాధించడం పట్ల ఏలూరి అభినందనలు తెలిపారు. మంచి ర్యాంక్ సాధించి పర్చూరు నియోజకవర్గం విద్యా కుసుమంగా లక్ష్మి సుజిత వెల్లివిరిసిందని ఎమ్మెల్యే ఏలూరి ప్రశంసించారు. భవిష్యత్తులో మరెన్నో అత్యున్నత బాధ్యతలు చేపట్టాలని, ప్రజాసేవలో ముమ్ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

లక్ష్మీ తన్మయినని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, బంధువులు

## నీట్‌లో మెరిసిన లక్ష్మీ తన్మయి

**ప్రజాశక్తి-అద్దంకి:** అద్దంకి నగర నివాసి దేవరకొండ లక్ష్మీ తన్మయి 2023 సంవత్సరానికి నీట్ పరీక్షలో 720 మార్కులకు గాను 598 మార్కులు, ఆలిండియాలో 29,829వ ర్యాంకు సాధించి అద్దంకి పట్టణానికి మంచిపేరు తెచ్చిపెట్టిందని ఉపాధ్యాయ సంఘ నాయకులు ముద్దపాటి శ్రీనివాసరావు కొనియాడారు. అస్త్ర మెడికల్ అకాడమీ విజయవాడలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటూ ఈ ఘనతను సాధించిందని అన్నారు. శ్రీధర్ వూర్మిళాదేవి దంపతులకు లక్ష్మీ తన్మయి రెండో సంతానం. లక్ష్మి తన్మయి మాట్లాడుతూ డాక్టర్ అవ్వాలనే తన చిరకాల కోరిక నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలియజేసింది. నీట్‌లో ఆలిండియా స్థాయిలో మంచి ర్యాంకు సాధించి అద్దంకి పట్టణానికి మంచిపేరు తెచ్చినందుకు ముద్దపాటి శ్రీనివాసరావు, ఫణిదం శ్రీనివాసరావు, పీరు సాహెబ్, కెకె కుమార్, రాజశేఖర్, కొంగల శ్రీను, కోటి, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, దార్ల శ్రీను, జోసఫ్ అభినందించారు.

చెరువును నీటితో నింపుతున్న దృశ్యం

## నేటి నుంచి నీటి సరఫరా

**ప్రజాశక్తి-బాపట్ల:** బాపట్ల పురపాలక సంఘ పరిధిలో నేటి నుంచి ప్రతి రోజూ మంచి నీరు సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ గురువారం విలేకరులకు తెలిపారు. గతంలో ఏ సమయానికి నీటి సరఫరా జరుగుతుందో అదే సమయానికి యథాతథంగా పట్టణంలో నీటి సరఫరా జరుగుతుందని ఆయన తెలిపారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం

### వైసీపీ పాలనలో భ్రష్టు పట్టిన విద్యావ్యవస్థ ● పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరి

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి విద్యార్థుల జీవితాలతో సీఎం జగన్ చెలగాటం ఆడుతున్నారని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో బాపట్ల పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మొవ్వ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ఫీజు ఎక్కడ కంసమామా?' వాల్ పోస్టర్‌ను ఏలూరి ఆవిష్కరించారు. అనంతరం ఏలూరి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు సక్రమంగా ఫీజు రీయింబర్స్ మెంట్ జరగడం లేదన్నారు. సగం మంది విద్యార్థులకు ఫీజ్ ఎగ్గొట్టారని, హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని మండిపడ్డారు. వసతి దీవెన పేరుతో వంచనకు పాల్పడుతున్నారని, అమ్మఒడి పథకం అర్హులకు వర్తింప చేయకుండా సీఎం జగన్‌రెడ్డి విద్యార్థులను నయవంచన చేస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశం హయాంలో హాస్టల్ విద్యార్థులకు రూ.18,500 ఇస్తే జగన్‌రెడ్డి రూ.15 వేలు

టిఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి 'ఫీజు ఎక్కడ కంస మామా?' పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఇస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని, వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లలో ఒక్క డీఎస్సీ ఏర్పాటు చేయలేదన్నారు. ప్రాథమిక విద్యను అథమ స్థాయికి తొక్కేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని ఏలూరి అన్నారు. ప్రాథమిక విద్య దేశంలో ఏపీ 19వ స్థానానికి చేరుకుం దని విద్య బోధించే ఉపాధ్యాయులను నీచంగా చూసే పరిస్థితి వైసిపి ప్రభుత్వంలో ఉందన్నారు. 8000 ప్రభుత్వ పాఠశాలలను వైసిపి ప్రభుత్వం మూసివేసిందని, నాడు-నేడు పేరుతో కోట్ల రూపాయలు వైసిపి నాయకుల జేబుల్లోకి దారి మళ్లించి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. అనంతరం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మొవ్వ శరత్‌చంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బేసిక్ ఫౌండేషన్ సర్వేల్లో ఏపీ 29వ స్థానంలో ఉందన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాల వల్ల 3.90 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరకపోవడంతో అడ్మిషన్‌లు రోజురోజుకూ తగ్గిపోతున్నాయన్నారు. విద్యావ్యవస్థపై ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి సరైన అవగాహన లేకపోవడంతో రాష్ట్రంలో ఇలాంటి దుస్థితి వచ్చిందన్నారు. ఎయిడెడ్ స్కూల్స్‌కి చెందిన ఆస్తులు కొట్టెయ్యడానికి నిబంధనల పేరుతో ఆ స్కూల్స్‌ను చాలా వరకు మూసివేశారని, విదేశీ విద్య ద్వారా 230 మందికి మాత్రమే సహాయం అందించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక, విద్యను పూర్తిగా నాశనం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు గొల్లపూడి శ్రీనివాసరావు, దేవేందర్ బాలాజీ, తలశీల మోహన్, సోషల్ మీడియ కోఆర్డినేటర్ మహేంద్ర, గుమ్మడి సాయి, సాయిరామ్, సునీల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

## సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా

**ప్రజాశక్తి-వేటపాలెం**

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సంఘం గౌరవ అధ్యక్షులు ఎం వసంతరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని కోరారు. సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్‌వాడీలు నెట్టబడ్డారని పేర్కొన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారన్నారు. రిటైర్ అయిన తర్వాత ఎలాంటి బెనిఫిట్ లేదని అన్నారు. అంగన్‌వాడీలను వర్కర్లుగా గుర్తించి గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తదనంతరం కోరికలతో కూడిన పత్రాన్ని ఏసిడిపిఓ ఎం సుచిత్రకు అందజేశారు. ఈ కార్యక్రమానికి వేటపాలెం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు పి ప్రమీల, నాయకురాలు జి పద్మావతి, పి పద్మ, అనూష, రమణ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్ మెగా డ్రైవ్‌లో పోలీసు అధికారులు, ఉమెన్ పోలీసులు

## 'దిశ' డౌన్‌లోడ్‌లో 'బాపట్ల'కు ద్వితీయ స్థానం

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 14 తేదీన జరిగిన దిశ యాప్ మెగా డ్రైవ్ కార్యక్రమంలో బాపట్ల జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయం మహిళ పోలీసులు ప్రజలకు దిశ యాప్ గురించి విస్తత అవగాహన కల్పించి 12 వేల మొబైల్ ఫోన్‌లలో దిశ యాప్ డౌన్లోడ్ చేయించారు. పోలీస్ సిబ్బంది విశేష కృషి వల్ల రాష్ట్ర వ్యాప్తంగా దిశ యాప్ డౌన్లోడ్‌లలో బాపట్ల జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దిశ యాప్ డౌన్లోడ్ లో బాపట్ల జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానం రావడానికి విశేష కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయం మహిళ పోలీసులను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా దిశ యాప్‌ను రూపొందించిందని, దిశ యాప్‌పై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి వారిచే దిశ యాప్ లను డౌన్లోడ్ చేయించడానికి నిర్వహించిన దిశ యాప్ మెగా డ్రైవ్ కార్యక్రమంలో జూన్ 14న సుమారు 12 వేల మొబైల్ లలో దిశ యాప్ లను డౌన్లోడ్ చేయించామన్నారు. జూన్ 15 గురువారం జరుగుతున్న దిశ యాప్ మెగా డ్రైవ్‌లో కూడా అదే స్ఫూర్తితో దిశ యాప్ లు డౌన్లోడ్ చేయించినట్లు తెలిపారు. దిశ యాప్ మహిళలకే కాదు, అందరికీ ఉపయోగ పడుతుందన్నారు. ఆపద ఏ సమయంలో ఏరూపంలో వస్తుందో ఎవరూ ఊహించలేరని, అటువంటి ఊహించని ఆపదలు ఎదురైనప్పుడు వాటి నుంచి బయట పడడానికి పోలీసుల తక్షణ సహాయం కోసం దిశ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. దిశ యాప్ అవశ్యకత తెలుసుకొని మొబైల్ ఫోన్‌లలో డౌన్లోడ్ చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

# అభివృద్ధి సాధనలో మహిళల పాత్ర కీలకం

### ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

**ప్రజాశక్తి-బాపట్ల**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధనకు మహిళలపాత్ర ఎంతో కీలకమని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం బాపట్ల మండల పర్యటనలో భాగంగా మండలంలో మూలపాలెం తదితర గ్రామాల్లో పర్యటించిన అనంతరం బాపట్ల ఎంపీడీవో కార్యాలయంలో డిఆర్‌డిఎ వైఎస్సార్ క్రాంతి పథంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకాన్ని మహిళలకు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, జగనన్న తోడు పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివద్ధి చెందుతున్నారన్నారు. డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ బి

మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

అర్జునరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు జీవనోపాధులు పెంచుకొనేందుకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో 2023-24 యేడాదికి క్రెడిట్ ప్లాన్ తయారు చేసుకుని ప్రతి పథకానికి సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసే కార్యక్రమం ఈ నెల 30 నాటికి పూర్తి చేసి వారందరికీ బ్యాంకులు, డిఆర్డిఏ ద్వారా రుణ సదుపాయాలు కల్పించి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లాలో వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా అమలు జరుగుతున్న పథకాల అమలు తీరును అధికారులు నాగార్జునరెడ్డికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ రాధాకృష్ణ, ఎంపీపీ చిన్నిపోతుల హరిబాబు, బాపట్ల ఏఎంసి చైర్మన్ డి సీతారామిరెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ సుబ్బారావు, డిపిఎంలు లక్ష్మణాచారి, ప్రమీల రాణి, శ్రీనిధి ఏజీఎం నాగబాబు, ఏపీఎం డి సురేష్, సీసీ రత్నరాజు, ప్రకాశరావు, సుమలత, శివరాం ప్రసాద్, వివోఏలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

## వ్యవసాయ కార్మిక సంఘం

**ప్రజాశక్తి -మద్దిపాడు**

ఉపాధి చట్టాన్ని కాపాడుకోనేందుకు ఈనెల 24న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిధిలోని దొడ్డవరప్పాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుందన్నారు. మోడీ ఈ కుట్రలను మానుకోకపోతే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, బాలకష్ణ, శ్రీనివాసరావు, మాల కొండయ్య ఉన్నారు. **కొండపి :** ఉపాధి చట్టాని రక్షించుకొనేందుకు ఈనెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి.మస్తాన్ తెలిపారు. ధర్నాలో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కొండపి చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీల మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధర్నా సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మద్దిపాడులో కూలీలతో మాట్లాడుతున్న ఉబ్బా వెంకటేశ్వర్లు

కొండపిలో కూలీలతో మాట్లాడుతున్న కెజి. మస్తాన్

# పేదల సంక్షేమమే ధ్యేయం : బూచేపల్లి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నట్లు జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. చీమకుర్తి మండలం గోనుగుంట సచివాలయం పరిధిలో స్థానిక ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకరబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ గడప గడపకూ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకాయమ్మ మాట్లాడుతూ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు జగనన్న కానుకను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. అనంతరం మండల పరిషత్ నిధులతో చిన్నరావిపాడు నుంచి మర్రిపాలెం మీదుగా మువ్వావారిపాలెం తారు రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, నాయకులు కె. శేఖరరెడ్డి,డి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శంకుస్థాపనలో జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

## 35 పొగాకు బేళ్లు తిరస్కరణ

**ప్రజాశక్తి-టంగుటూరు**

స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు వేలం కేంద్రానికి కట్టుబడిపాలెం, కమ్మవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 861 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 826 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 35 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.240, అత్యల్ప ధర రూ.161, సరాసరిధర రూ.232 పలికినట్లు ఎవస్ శ్రీనివాసరావు తెలిపారు. వేలంలో 23 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఎస్‌జిఓ సునీల్ కుమార్, బోర్డు సిబ్బంది, రైతు నాయకులు పాల్గొన్నారు.**కొండపి:** కొండపిలోని పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 976 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 924 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 52 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. 240, అత్యల్ప ధర రూ.155 , సరాసరి ధర రూ.231.40పైసలు పలికింది.

## పథకాలను వినియోగించుకోవాలి

**పొదిలి** :పశుపోషకులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ఎం.మణి శేఖర్ అన్నారు. మండల పరిధిలోని ఆముదాల పల్లి గ్రామంలో పశు విజ్ఞాన బడి గ్రామ సభ సర్పంచి చిరుపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకలకు నట్టాల నివారణ మందు తాగించాలన్నారు. పశు పోషకులకు పశు సంవర్థక శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. సమీకత దాణా (టిఎంఆర్) కిలో 6.90 పైసలకు అందుబాటులో ఉంటుందన్నారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పశుసంవర్ధక సహాయకులు లక్ష్మీ తిరుపతమ్మ , పశుపోషకులు, రైతులు పాల్గొన్నారు.

# 'జగనన్న ఆణిముత్యాల'కు సత్కారం

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. స్థానిక అంబేద్కర్ భవనంలో జగనన్న ఆణిముత్యాలు పథకానికి ఎంపికైన విద్యార్థులను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే 3 రెట్లు అధికంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు వెళ్లే పిల్లల తల్లుల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు జగనన్న అమ్మ ఒడి పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరిచేందుకు మన బడి నాడు-నేడు పథకం కింద రూ.13 వేల కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన త్రిపురాంతకం మండలం గణపవరం గురుకులానికి చెందిన పదో తరగతి విద్యార్థులకు డి.బాజి, బివి. నాగరాజు, పివి.బాల గోపాల్‌ను సన్మానించారు. ఇంటర్‌లో దోర్నాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఈ నాగదుర్గ, సూర్య ప్రకాష్, యర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన షేక్ రేష్మా, దూపాడు గురుకుల పాఠశాలకు మరియమ్మ జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికయ్యారు. పదో తరగతి విద్యార్థులకు ప్రథమ బహుతిగా రూ. 15 వేలు, ద్వితీయ బహుమతిగా 10 వేలు, తృతీయ బహుమతిగా రూ. 5 వేలు, ఇంటర్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున నగదు బహుమతి అందేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెడి సుబ్బారావు, ఎంపిపి ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఛైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, మాకం జాన్‌పాల్, వాగ్యా నాయక్, వైసిపి మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఎంఇఒలు మస్తాన్ నాయక్, ఆంజనేయులు, తులసి మల్లికార్జున నాయక్, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **దర్శి :** రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులు, రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో చదువులో ప్రతిభ చూపించిన 8 మంది విద్యార్థుల గురువారం ప్రశంసాపత్రాలు అందజేశారు. నగదు బహుమతులు అందజేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయానికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అమ్మఒడి, జగనన్న కిట్లు, నాడు-నేడు పథకం విద్యార్థులకు నాణ్యమైన భోజనం, చిక్కీలు, రాగిజావ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు విదేశాలలో ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఇఒ కాకర్ల రఘురామయ్య, ప్రిన్సిపల్ హసీనాభాను, ఎఎంసి ఛైర్మన్ వైవి. సుబ్బయ్య, ఎంపిపిలు గోళ్లపాటి సుధారాణి, బెల్లం కోటేశ్వరమ్మ, తాళ్లూరు జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, తాళ్లూరు ఎంఇఒ సుబ్బయ్య, రాష్ట్ర డైరెక్టర్లు కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపిపి సోమ దుర్గారెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మన్ వెన్నపూస వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **కొమరోలు :** కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బి.సుస్మిత సీనియర్ ఇంటర్ సిఇసి విభాగంలో 937 మార్కులు సాధించింది. జి.సుమలత హెచ్ఇసి విభాగంలో 890 మార్కులు సాధించింది. ఈ విద్యార్థినులు జగనన్న ఆణిముత్యాలు స్టేట్ బ్రిలియన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. అందులో భాగంగా గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుచేతుల మీదుగా ఆ విద్యార్థినులను గురువారం సత్కారించారు. ఒక్కొక్కరికీ రూ.15 వేల వంతున నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నంద్యాల శ్రీనివాసులు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న మంత్రి సురేష్

దర్శిలో విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేణుగోపాల్

# ఉపాధ్యాయుల కొరతతో ఇక్కట్లు

## విద్యార్థుల్లో ఆందోళన

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో విద్యార్థులు ఆందోళన చెందు తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 1,250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి బోధన చేసేందుకు నింబధనల ప్రకారం 42 మంది ఉపాధ్యాయులు అవసరం. కేవలం 17 మంది మాత్రమే ఉన్నారు. తెలుగు బోధించడానికి ఐదుగురు ఉపాధ్యాయులు అవసరం కాగా ఒక్కరే ఉన్నారు. హిందీ బోధనకు నలుగురికి గానూ ఒక్కరే ఉన్నారు. ఇంగ్లీష్ బోధనకు ఐదుగురికి గానూ ఒక్కరే ఉన్నారు. లెక్కలు బోధించడానికి ఆరుగురికి గానూ నలుగురే ఉన్నారు. ఫిజిక్స్ బోధించడానికి ఐదుగురికి గానూ ఇద్దరే ఉన్నారు. బయాలజీ బోధించడానికి ఐదుగురికి గానూ ఇద్దరే ఉన్నారు. సోషల్ బోధించడానికి ఐదుగురికి గానూ ఇద్దరే ఉన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ ఆరుగురు ఉండాల్సి ఉండాల్సి ముగ్గేరే ఉన్నారు. మొత్తం 42కి గానూ 17 మంది మాత్రమే ఉన్నారు. 25 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలాగైతే తాము చదువులు ఎలా సాగించాలంటూ విద్యార్దులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల

**టీసీలు తీసుకునేందుకు సిద్ధం**

ఉపాధ్యాయుల కొరత పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలను వేరే పాఠశాలో చేర్పించేందుకు టీసీలు తీసుకొనేందుకు సిద్ధమవుతున్నారు. పాఠశాలలో సౌకర్యాలు కల్పించి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి కోరుతున్నాడు.

### అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

**నారాయణరెడ్డి,ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు**

పాఠశాలలో మొత్తం 42 మంది ఉపాధ్యాయులు సిబ్బంది ఉండాల్సి ఉంది. కేవలం 17 మంది మాత్రమే ఉన్నారు. దీంతో విద్యా బోధనకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బందిని నియమించాలని కోరాం.

భోజనం కోసం ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

## భోజనం కోసం విద్యార్థుల ఇక్కట్లు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని పాలకులు చెబుతున్నారు. మండల పరిధిలోని కొలుకుల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అందుకు భిన్నంగా ఉంది. పాఠశాలలు ప్రారంభమై మూడు రోజులైంది. ఇంత వరకూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టలేదు. కరెంటు సమస్య కారణం చూపుతూ మధ్యాహ్న భోజనం పెట్టలేదు. దీంతో విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో ఇంటి బాట పడుతున్నారు. మంత్రి నియోజకవర్గంలో మూడు రోజుల నుంచి మధ్యాహ్న భోజనం అమలు కాకపోవడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రంగోళి కార్యక్రమంలో అంగన్‌వాడీలు

## అంగన్‌వాడీ కేంద్రంలో 'రంగోళి'

**పిసిపల్లి :** అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ఆకర్షించేందుకు రంగోళి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కె.జరీనా తెలిపారు. రంగోళి కార్యక్రమంలో భాగంగా వివిధ రంగులతో అక్షరాలు, రంగు రంగుల ముగ్గులు ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో జనభాగస్వామ్య వారోత్సవం సందర్భంగా మండల పరిధిలోని గోపవరపుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రంగోళి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు విజయకుమారి, శ్రీలక్ష్మి, బుజ్జి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం** : జనభాగీదారీ కార్యక్రమంలో భాగంగా పుల్లలచెరువు మండలం నాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో రంగోలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు వారి పిల్లలకు అందించే సేవల గురించి వివరించారు. అనంతరం రంగోలి కార్యక్రమంలో భాగంగా ముగ్గులు వేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు జయమ్మ, ప్రసన్న, కాశమ్మ, శ్రీదేవి, శ్యామల, రమణ, సునీత పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు అందజేత

**కొనకనమిట్ల :** కొనకనమిట్లలోని ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయ ుడు గాయం కాశిరెడ్డి, ఉపాధ్యాయులు డాక్టర్ ఎస్‌కెజి.మస్తాన్, రహీం, సాయిలక్ష్మి , విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాకానుక పంపిణీ

**కనిగిరి :** మండల పరిధిలోని చినఇర్లపాడు ఎంపియుపి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను కనిగిరి సింగిల్‌విండో చైర్మన్ సంగు సుబ్బారెడ్డి చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎం. దానమ్మ, ఉపసర్పంచి సంగు కృష్ణారెడ్డి, సచివాలయ కార్యదర్శి సైకం సుబ్బారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొనారు.

కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న కనక దుర్గ

## కనదుర్గకు సర్టిఫికెట్ ప్రదానం

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

ఒంగోలులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో మెంబర్‌షిప్ ప్రదానోత్సవం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం సబ్ బ్రాంచిలో విశిష్టసేవలు అందిస్తూ రెడ్ క్రాస్‌ను ముందుకు తీసుకెళుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మార్కాపురం సబ్ బ్రాంచి చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గకు కలెక్టర్ దినేష్ కుమార్ సర్టిఫికెట్ అందించి అభినందించారు. రెడ్ క్రాస్‌కు రూ. 25 వేల చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి పాట్రన్ మెంబర్‌షిప్ సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ప్రకాష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఒంగోలు బ్రాంచి సభ్యులు చిట్యాల వెంకటేశ్వర రెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకష్ణ, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

## జడ్‌పి చైర్‌పర్సన్ పర్యటన వాయిదా

**ప్రజాశక్తి-పిసిపల్లి**

మండల పరిధిలోని పెదరెడ్లపాడు హైస్కూల్‌కు రావాల్సిన జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పర్యటన వాయిదా పడింది. జగనన్న విద్యాకానుక కిట్లను జడ్‌పి చైర్‌పర్సన్ చేతుల మీదుగా పంపిణీ చేయించాలని పిసిపల్లి జడ్‌పిటిసి భర్త ఓకేరెడ్డి వెంకాయమ్మను ఆహ్వానించారు. అయితే ఓకేరెడ్డి స్థానిక ఎమ్మెల్యే బుర్రాను సంప్రదించకుండా జడ్‌పి చైర్‌పర్సన్ ఆహ్వానించి ఈనెల 13న జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించాయి. తర్వాత ఎమ్మెల్యేను కలిసి జడ్‌పి చైర్‌పర్సన్ పర్యటన గురించి ఆయనకు వివరించాడు. అయితే ఎమ్మెల్యే తాను ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఈనెల 13న తమకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి హాజరు కాలేని తెలిపారు. దీంతో జడ్‌పి చైర్‌పర్సన్ పర్యటన వాయిదా వేశారు. మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో వైసిపి నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. బయటకు ఐక్యంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. అయినప్పటికీ ఎవ్వరికీ వారే యమునా తీరు అన్న చందంగా ఉంది వారి తీరు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇటీవల గ్రామాల్లో పర్యటించారు, ఆ సమయంలో కొందరు కార్యక్రమానికి దూరంగానూ, మరికొందరు అంటీ అంటన్నట్లుగా ఉన్నారు. ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు గతంలో టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వద్దకు వెళ్ళేవారు. ప్రస్తుతం రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి వద్దకు వెళ్తున్నారు.ఏదిఏమైనా జడ్‌పి చైర్‌పర్సన్ పర్యటన వాయిదా పడటంపై మండల ప్రజలు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు.

## ఖోఖో క్రీడాకారుడికి అభినందనలు

**ప్రజాశక్తి-కనిగిరి**

అస్సాంలో ఇటీవల నిర్వ హించిన 4వ ఏషియన్ గేమ్స్ ఖోఖో చాంపియన ్షిప్ పోటీల్లో బాపట్ల జిల్లా జె.పంగులూరు ఎస్ఆర్ఆర్ అకాడమికి చెందిన క్రీడాకారుడు అట్లా శివనాగిరెడ్డి బంగారు పతకాన్ని సాధించాడు. అందులో భాగంగా శివనాగిరెడ్డిని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్‌ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖోఖో అసోషి యేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడాకారుడుని అభినందిస్తున్న ఉగ్ర

## విద్యాలయంలో ఆర్‌జెడి తనిఖీ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెంలోని కస్తూరిబా బాలికా విద్యాలయాన్ని ఆర్‌జెడి సుబ్బారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి సుబ్బారావు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరుమలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాలయంలో తనిఖీ చేస్తున్న ఆర్‌జెడి

## రైతులను ఎంపిక చేయాలి

### ఉద్యానవన శాఖ అధికారి తేజ

**ప్రజాశక్తి-టంగుటూరు**

పండ్ల తోటల సాగుకు అనుకూలంగా భూములు కలిగిన రైతులను పంట తోటల సాగు పథకానికి ఎంపిక చేయాలని ఉద్యానవన శాఖ అధికారి తేజ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ రత్న జ్యోతి, హెచ్ఒ తేజ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఈ ఏడాది 100 ఎకరాల్లో పండ్ల తోటలు సాగుకు రైతులను ఎంపిక చేయాలన్నారు. లక్ష్యాలను సాధించేందుకు కందులూరు, వల్లూరు, కారుమంచి, మర్లపాడు, కాకుటూరువారిపాలెం, జయవరం, టంగుటూరు, మల్లవరప్పాడు గ్రామాలలో పంచాయతీ తీర్మానం పొందిన అర్హత కలిగిన రైతులను ఎంపిక చేయాలన్నారు. అదేవిధంగా పండ్ల తోటల సాగు పథకం కోసం సన్న, చిన్నకారు రైతులు, పట్టాదారు పాస్ బుక్, జాబ్ కార్డు కలిగి ఉన్న రైతులు అర్హులన్నారు. రైతుల ఎంపిక కోసం ఆయా గ్రామాలలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులు, ఉపాధి పథకం క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యత తీసుకోవాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం ఎపిఒ సుభాషిణి, ఎఒ స్వర్ణలత, వివిధ గ్రామాల వ్యవసాయ, ఉద్యానవన శాఖ, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి తేజ

ఆగని ఆక్రమణలు

# మలుపులు తిరుగుతున్న గోడౌన్ స్థల వివాదం

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

అద్దేపల్లి సొసైటీ గోడౌన్ స్థల వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. ఓ పక్క ఉన్నతాధికారులు గోడౌన్ స్థలం చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేస్తాం. గోడౌన్ స్థలం ఏ ఒక్కరూ అక్రమించుకోవటానికి వీలులేదు అని చెపుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఆక్రమణదారులు యథేచ్ఛగా గురువారం కట్టడానికి పూనుకొని బోర్లు తీయిస్తున్నారు. ఈ విషయంలో అక్రమార్కులదే పైచేయిగా కనిపిస్తోంది. అదేమని అడిగితే సొసైటీ అధికారులకు చెప్పి మరీ పనిని చేపట్టామని చెబుతుండడం గమనార్హం. రేపల్లె వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో 1962లో ఆనాటి కమిటీ వైస్ చైర్మన్, అద్దేపల్లి మునసబుగా ఉన్న సప్తర్ అలీ బేగ్ ఇక్కడ గోడౌన్‌ను నిర్మించారని పలువురు గ్రామస్థులు పేర్కొంటున్నారు. తదనంతరం 1977లో పిఎసిఎస్‌లు ఏర్పడగా 1979-80లో అదే గ్రామానికి చెందిన అబ్దుల్ కలందర్ పిఎసిఎస్ డైరెక్టర్‌గా పని చేశారని, ఆ సమయంలో భూస్వామిగా ఉన్న కలందర్ ఈ గోడౌన్‌ను కొన్నేళ్లపాటు ఉపయోగించుకున్నారని, దీనితో పాటు గోడౌన్ సమీపంలో

ఆక్రమిత స్థలంలో అక్రమ కట్టడ నిర్మాణం పనులు, సిఇఓ చెబితేనే కడుతున్నాం అంటున్న కబ్జాదారులు

అర ఎకరా పైగా స్థలం ఉండటంతో కలందర్ గోడౌన్ అని పిలిచేవారే తప్ప ఈ స్థలంతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని అక్కడ ఉన్న అనేక మంది వృద్ధ రైతులు తెలియజేస్తున్నారు.

**సొసైటీ అధికారుల వ్యవహారంపై పలు అనుమానాలు**

అద్దేపల్లి గోడౌన్ స్థలం సొసైటీకి చెందినదేనని బోర్డులు కూడా ఏర్పాటు చేసిన సొసైటీ అధికారులు ఆక్రమణదారులు యథేచ్ఛగా అక్రమ కట్టడాలు చేపట్టినా పట్టించుకోకపోవటం వెనుక వారి హస్తం ఉన్నట్లుగా చర్చించుకుంటున్నారు. కబ్జాదారుల్లో ఒకరు గతంలో సొసైటీలో గుమస్తాగా పనిచేశారు. సొసైటీకి చెందిన ఎరువులు, పురుగు మందుల దుకాణంలో అమ్మకాలు చేస్తూ తెలిసిన కొందరు రైతులకు రుణాలు ఇప్పించే వాడు. ఆ సమయంలో సొసైటీలో కొన్ని లక్షల రూపాయల అవినీతి జరిగిందని, దీని కారణంగా అతనిని తొలగించారని, ఇవి కాక సొసైటీలో ఉన్న కొన్ని అవినీతి అక్రమాలు అతనికి తెలుసని, దీని కారణంగా అతను చెప్పిన విధంగానే సిఈఓ భయపడి ఎదురు చెప్పలేక సొసైటీ స్థలాన్ని అక్రమిస్తున్నా మిన్నకుండి పోయారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి దాతలు అప్పగించిన స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ఉత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-బాపట్ల**

విద్యార్థికి నగదు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న దృశ్యం..

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి ప్రపంచ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో ఉత్తమ విద్యా బోధనతో అత్యుత్తమ ఫలితాల సాధనకు వైసీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. గురువారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో బాపట్ల నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో నగదు అవార్డుల ప్రదానోత్సవానికి కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో విద్యార్థులకు సైతం ఆంగ్ల విద్య బోధన ద్వారా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు జగనన్న ప్రభుత్వం నూతన విద్యా విధానంతో ముందుకెళుతోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా ఫలాలను అందిపుచ్చుకొని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. అందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రోత్సాహం అవసరమని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా విద్యార్థులకు విద్యాబోధన గావించాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ జి రవీందర్, బాపట్ల ఎంపీపీ చన్నిపోతుల హరిబాబు, డిఈఓ పివిజె రామారావు, ఎంఈఓ నిరంజన్ ,మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం రాజశ్రీ, సాదిక్ మాస్టారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'సెయింట్ ఆన్స్' విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

**ప్రజాశక్తి-వేటపాలెం**

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, కాకినాడ వారు 2023 ఏప్రిల్‌లో నిర్వహించిన బి ఫార్మసి నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసి చీరాల బి ఫార్మసి విద్యార్థులు 96.5 శాతం ఫలితాలు సాధించారని కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు కరస్పాండెంట్ ఎన్ లక్ష్మణరావు సంయుక్తంగా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు బి ఫార్మసి నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో పరీక్షలలో 96.5 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వివి నాగేశ్వరరావు తెలిపారు. 56 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా అందులో ముగ్గురు జి దీపిక, డి హిమబిందు, టి సాయి బిందు మాధవిలు ఎక్సలెంట్ గ్రేడ్‌లో ఉత్తీర్ణులు కాగా 53 మంది విద్యార్థులు డిస్టింక్షన్ గ్రేడ్లో, మరియు ముగ్గురు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులు అయినట్లు తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన, మంచి లైబ్రరీ సౌకర్యం, ఉచితంగా ఇంటర్ నెట్, కమ్యూనికేషన్ స్కిల్స్ బోధన, అత్యాధునిక కంప్యూటర్ లాబ్ మొదలైన సౌకర్యాలను కలుగజేసినందున ఈ ఫలితాలు సాధించగలిగామని కళాశాల యాజమాన్యం తెలిపింది. బి ఫార్మసి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ప్రిన్సిపాల్ వివి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ సందర్భముగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, బి ఫార్మసి అధ్యాపకులు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శ్రీ ఆర్‌వి రమణమూర్తి ఉత్తమ ఫలితాలు సాధించిన బి ఫార్మసి విద్యార్థులను అభినందించారు.

# తెలుగుదేశం పార్టీతోనే యువతకు భవిష్యత్తు

**మహిళలు ఆర్థికంగా ఎదగడానికి మహాశక్తి పేరుతో పెద్దపీట.! ● అందుకే నారా లోకేష్ పాదయాత్ర ● అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్**

**ప్రజాశక్తి-అద్దంకి**

తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం నిర్వహిస్తున్న శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, హాజరయిన టిడిపి శ్రేణులు

భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రిలిమినరీ మేనిఫెస్టో అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ విస్తత సమావేశం నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ముందుగా అన్న నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆడబిడ్డల్ని మహాశక్తిగా రూపొందించేందుకు మహాశక్తి పథకం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, 18-59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500, ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15 వేలు, యువతకు రూ.3 వేల నిరుద్యోగ భతి, 20 లక్షల ఉద్యోగాల భర్తీ, రైతులకు ఏడాదికి రూ.20 వేలు, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, కుళాయి ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు, పూర్ టు రిచ్ పేరుతో పేదల్ని ధనికులుగా చేసేందుకే మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. నేతలందరూ ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో గురించి వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం మొదలు, స్వయం సహాయక సంఘాల ఏర్పాటు వరకు తెలుగుదేశం పార్టీ పాలనలో తీసుకున్న నిర్ణయాలేనని అన్నారు. ఆడ పడుచులకు స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన సమజీవనం కల్పించాలన్నదే తెలుగుదేశం పార్టీ ఆశయమని తెలిపారు. పేదవాడికి టిడ్కో గృహాలు ఇవ్వడం చేతకాని ముఖ్యమంత్రి చెత్త పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక పేదల సొంతింటి కల పెనుభారంగా తయారైందని అన్నారు. అధికారంలోకి రావడం కోసం నోటికొచ్చిన అబద్ధాలు చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఇళ్ళు కట్టి ఇవ్వడానికి నానా తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌రెడ్డి తన తుగ్లక్ నిర్ణయాలతో ఇళ్ల స్థలాల కొనుగోలు అంటూ కొత్త స్కాంకు తెర తీశారన్నారు. పనికి రాని భూములను మూడు నాలుగు రెట్ల అధిక ధరలకు ప్రభుత్వంతో కొనిపించి వైసిపి నాయకులు మూటలు వెనకేసుకున్నారని ఆరోపించారు.

సమావేశంలో మాట్లాడుతున్న బుడా చైర్మన్ దేవినేని

## రెడ్ క్రాస్ సంస్థ సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి-రేపల్లె**

ప్రజలకు రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయం అని బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు అన్నారు. పట్టణంలోని రెడ్ క్రాస్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 10 కెవి సోలార్ విద్యుత్ ప్లాంటును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమాల ద్వారా రెడ్‌క్రాస్ ఆపన్నులకు ప్రాణదానం చేస్తున్నదని అన్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన కాకినాడ పోర్ట్ ప్రతినిధి మురళీధర్‌ను, అందుకు సహకరించిన కాకినాడ రెడ్‌క్రాస్ బ్రాంచి చైర్మన్ రామారావును అభినందించారు. రెడ్‌క్రాస్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య, తెనాలి రెడ్ క్రాస్ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ భానుమతి, బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ బ్రాంచి చైర్మన్ నారాయణ బట్టు, గుంటూరు జిల్లా రెడ్ క్రాస్ బ్రాంచ్ చైర్మన్ రామచంద్ర రాజు, నిజాంపట్నం సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ కాళేపల్లి గౌరీ శంకర్, మోపిదేవి వెంకటేశ్వరరావు, విశిష్ట రక్తదాతగా పేరు గడించిన గురు ప్రసాద్, అడుసుమల్లి ప్రభాకరరావు, సయ్యద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## 20వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలి: ఎంపీడీవో

**ప్రజాశక్తి-చీరాల**

మండల పరిధిలోని ఖాళీగా ఉన్న వాలంటీర్ ఉద్యోగాలకు ఈ నెల 20 తేది లోపల దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నేతాజీ అన్నరు. ఈ సందర్భంగా గురువారం ఎంపీడీవో చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చీరాల మండల పరిధిలో 15 పంచాయతీలకు సంబంధించి 448 వాలంటీర్లు పని చేస్తున్నారన్నారు. అయితే వివిధ కారణల రీత్యా తోటవారిపాలెం-1, ఈపూరుపాలెం-3 మొత్తంగా 4 పోస్టులు ఖాళీగా ఉండటంతో నోటిపికేషన్ వేసినట్లు తెలిపారు. ఈ వాలంటీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు చీరాల మండల నివాసి అయి ఉండి, పదోతరగతి విధిగా పాస్ అయి ఉండాలన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సును కలిగి వుండాలన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 28 నుంచి 30 వరకు ఇంటర్యూలు నిర్వహిస్తామని, జులై 3న నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాశక్తి-చీరాల**

చీరాల పట్టణంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ ఉద్యోగాలకు ఈ నెల 20వ తేదీ లోపల ధరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చీరాల పట్టణ సచివాలయాల పరిధిలోని మొత్తం 525 మంది వాలంటీర్లు పనిచేస్తున్నారని, అయితే వివిధ కారాణాల రీత్యా 7 వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో దరఖాస్తులు కోరినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు పట్టణ వాసులై ఉండాలని, 10వ తరగతి ఖచ్చితంగా పూర్తిచేసి ఉండాలని అన్నారు. 18నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28,29,30 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

**- డిఐసి జిఎం ఎస్.శ్రీనివాసరావు - పరిశ్రమల యజమానులకు సూచన**

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

నిరుద్యోగ యువతీ, యువకులకు పరిశ్రమ యజమానులు ఉపాధి కల్పించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయంలో జి 20 జన్ బాగీదరి పీపుల్ పార్టీసిపేషన్ ఈవెంట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 15 కంపెనీల ప్రతినిధులతో పరిశ్రమల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎపిఎస్ఎస్‌డిసి డిఎస్‌డిఒ ఆర్.లోకనాథం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న వారిని అభినందించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పరిశ్రమలో అవసరానికి తగ్గట్టు ఎప్పటికప్పుడు ఎపిఎస్-ఎస్‌డిసి, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ద్వారా నిరంతరం స్థానిక సంస్థల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు సమాచారం ఇస్తూ అలాగే స్థానికంగా డ్రైవ్స్ ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి ఆర్.లోకనాథం, మాట్లాడారు. కార్యక్రమంలో వయోజన విద్య ఎపిఒ సురేఖ యంగ్ ప్రొఫెషనల్ దత్తాత్రేయ, వయోజన విద్య పర్యవేక్షకులు టి. పోతురాజు, జ్యోతి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ షేక్ బాషా, 15 కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'వెలిగొండ' నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

**ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా**

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

శ్రీ పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఏ ఒక్క కుటుంబానికీ అన్యాయం జరగకుండా ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అందజేయాలని నిర్వాసితుల సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి మార్కాపురం ఉప కలెక్టర్ సేతు మాధవన్ కోరారు. గురవారం స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీ పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణంలో ముంపు గురైన 11 గ్రామాలకు

ఉప కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు

చెందిన 7200 మందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం ఇవ్వాలని పదే పదే ప్రభుత్వల దృష్టి తీసుకొని వెళ్ళినా ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికి రెండు సార్లు నిధులు మంజూరు చేసినా కూడా నిర్వాసితులకు నష్టపరిహారం అందకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్కాపురం పర్యటనకు వచ్చిన క్రమంలో అక్టోబర్ నెల లోపు శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నీళ్ల ఇస్తామని ప్రకటించి చేతులు దలుపుకున్నారే తప్ప ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటి లోపు పరిష్కరిస్తారన్న స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే నిర్వాసిత గ్రామాలకు చెందిన ప్రజలను ఏకం చేసుకొని ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సైతం వెనుకడబోమని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఉప కలెక్టర్ సేతు మాధవన్‌కు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు, ముంపు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# నీట్‌లో 'జిఎన్ఆర్'కి ఉత్తమ ర్యాంకులు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

నీట్ పరీక్షా ఫలితాలలో జిఎన్ఆర్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. స్థాపించిన రెండో సంవత్సరంలో విద్యార్థులు విజయభేరి మోగించారు. టి.బాలముందర్‌రెడ్డి 700కు గానూ 595 మార్కులు, టి.ప్రజ్ఞశ్రీ 587 మార్కులు, కె.మదన్ మోహన్ 585, ఎం.బబాల లక్షయ 571, ఎం.తన్విత 563, వై.భావన 559, జి.అమృత 559 మార్కులు సాధించారు. వివిధ కేటగిరిలలో 35 మంది పైగా మెడికల్ సీట్లు సాధించే అవకాశం ఉందని డైరెక్టర్ గోగినేని నాగేశ్వరరావు తెలియజేశారు.

# శ్రీశ్రీ, నాగభైరవకు ఘన నివాళి

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

జూన్ 14న నాగభైరవ కోటేశ్వరరావు, జూన్ 15న శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సభ నిర్వహించారు. సభకు సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఇద్దరి చిత్రపటాలకు పూలదండలు వేసి.. నివాళులర్పించారు. సభలో కళామిత్రమండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు పాల్గొన్నారు.

# మహిళల భద్రత, రక్షణే ధ్యేయం: ఎస్‌పి

**ప్రజాశక్తి-ఒంగోలు**

మహిళల భద్రత, రక్షణే ధ్యేయంగా అంకితభావంతో పనిచేయాలని ఎస్‌పి మల్లికగర్గ్ సచివాలయ మహిళా పోలీసులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరించి ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామ/వార్డ్ సచివాలయాల మహిళా పోలీసులకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినట్లు ఎస్పీ మల్లికగర్గ్ తెలిపారు. దివ్యాంగులు, మ్యూచువల్ అంగీకారం, స్పౌజ్, మానసిక వికలాంగ పిల్లలను కలిగి ఉన్నవారికి, వైద్యపరమైన సమస్యలు, ఒంటరి మహిళలు/వితంతు కేటగిరిల్లో వచ్చిన బదిలీల విన్నతులపై 44 మహిళా పోలీసులలో ఒక్కొక్కరితో ముఖాముఖిగా మాట్లాడి,

బదిలీ పత్రం అందజేస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

కౌన్సిలింగ్ పక్రియ ముందుగా వివరించి, వారి వారి నేటివ్ ప్లేస్‌లో కాకుండా ఇతర సచివాలయాల్లో ఉన్న ఖాళీలు ఆధారంగా ప్రత్యక్షంగా స్క్రీన్‌పై చూపి వాటిలో వారు కోరుకున్న చోటికి బదిలీ చేసి వెంటనే ట్రాన్ఫ్సర్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అంతర్భాగమై గ్రామ/వార్డ్ సచివాలయాల పరిధిలో మహిళాల భద్రతలో కీలక పాత్ర పోషించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం సేకరించడం ప్రముఖ పాత్ర పోషించాలని తెలిపారు. జాబ్ మోసాలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, వివిధ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారికి కేటాయించిన వివిధ టాస్కులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని, మెరుగైన రీతిలో ప్రజలకు సేవలను అందించడానికి అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. విధి నిర్వహణలో శాఖాపరమైన సహకారం అందించడానికి తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏవో యం.సులోచన, ఐటి కోర్ ఎస్సై కె.అజయ్ కుమార్, ఏ సూపరింటెండెంట్ డి.శైలజ, డిపిఓ సిబ్బంది మరియు ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**కార్పొరేషన్, మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికుల ధర్నా**

ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

కాంట్రాక్ట్ కార్మికులతో పాటు అవుట్ సోర్సింగ్, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే పారిశుధ్య కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ సెక్రటరీ శ్రీరామ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి కమిషనర్ కి అర్జీ ఇచ్చారు. కార్యక్రమానికి నగర నాయకులు రంపతోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా శ్రీరామ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈపీఎఫ్ దీర్ఘ కాలిక సమస్య అని, గత సమ్మె సందర్భంగా ప్రతి కార్మికుడి సంబంధించిన డేటా దస్ బోర్డుపై చూపిస్తామని మాయమాటలు చెప్పి ప్రస్తుతం మాకు సంబంధం లేదు అన్నట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. ఈఎస్ఐ కార్డులు ఎన్ని సార్లు అడిగినా ఇస్తామంటూ, కాలయాపన చేస్తున్నారన్నారు. చనిపోయిన కార్మికుల బదులు వారి కుటుంబ సభ్యుల్ని తీసుకుంటామని చెప్పి ఇంతవరకు ఇలాంటి ప్రాసెస్ చేయలేదన్నారు. కోవిడ్ పేరుతో ఉన్న కార్మికులను ఆప్కాస్ లోకి చేర్చి జీవో నెంబర్ 7 ప్రకారం 15000 వేతనం ఇవ్వాలని, ప్రస్తుతం పని చేస్తున్న ఏ ఒక్క కార్మికుడిని తొలగించరాదన్నారు. హౌస్ ఓల్డ్ సర్వే నిర్వహించి కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు బాలకష్ణ, సిహెచ్ అక్కేశ్వరరావు, దివ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అద్దంకిలో ధర్నా చేస్తున్న కార్మికులు

**మార్కాపురం రూరల్:** అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మునిసిపాల్ కార్మికులను రెగ్యూలర్స్ చేస్తామని హామి ఇచ్చిన తీరా అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల కావచ్చిన ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారని సిఐటియు జిల్లా కార్యదర్శి డికేఎం రఫీ ఎద్దేవా చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మిక సోదరులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికేఎం రఫీ మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో సంవత్సరాలు తరబడి పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వం వారి చేత వెట్టి చాకిరి చేయించుకుంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కే సుబ్బరాయుడు ,ఎస్ కే ఇమాంసా, జి పి తిరుమలయ్య ,పి.సలాం ఖాన్ , ఎం సి హెచ్ అల్లూరయ్య,పి శ్రీను, రమణ, పిఏ బ్రహ్మం, కనకయ్య, చెన్నకేశవులు, గురునాథం, నాసరయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**కనిగిరి:** మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్‌కె. ఖాదర్‌వలి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు గురువారం నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

**ఇంకొల్లు రూరల్:** ఇంకొల్లు గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇప్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 4 నెలల జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని సిఐటియు మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సూపరింటెండెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో నల్లపు రంగారావు, నాగరాజు, మరియమ్మ, ప్రభుదాసు, శ్యాం, గోపి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో ధర్నా చేస్తున్న కార్మికులు

**అద్దంకి:** ముఖ్యమంత్రి పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి జి వెంకట్రావు అన్నారు. గురువారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి ఆదాము, సిఐటియు జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

ఇంకొల్లులో ధర్నా చేస్తున్న కార్మికులు